# దళితులను మోసం చేసి ఇప్పుడు దళితుల ఆత్మగౌరవాన్నే అవమానిస్తున్న బీఆర్ఎస్

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలపై బీఆర్ఎస్ అధిష్ఠానం సమాధానం చెప్పాలని డిమాండ్

**జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మల్క గల్ల కరుణాకర్,, మోహన్, కర్రోళ్ల ప్రవీణ్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. హామీలతో మభ్యపెట్టి.. చివరకు వారి ఆత్మగౌరవాన్నే అవమానించే స్థాయికి బీఆర్ఎస్ రాజకీయాలు దిగజారాయని మల్క గల్ల కరుణాకర్, మోహన్ కర్రోళ్ల ప్రవీణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళిత ముఖ్యమంత్రి పేరుతో తెలంగాణలో తొలిసారిగా దళితులను రాజకీయంగా మోసం చేసింది బీఆర్ఎస్‌నే అని ఆరోపించారు. దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి అంటూ ఎన్నో హామీలు ఇచ్చి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓట్లు దండుకుని అధికార పీఠాన్ని అధిష్ఠించారని విమర్శించారు.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దళితుల సమస్యలను పరిష్కరించకుండా మాటలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. నాయకత్వం ఏ బాటలో నడిస్తే.. కింది స్థాయి నాయకులు కూడా అదే బాటలో నడుస్తారని, అందుకే బీఆర్ఎస్ నేతల్లో దళితుల పట్ల చిన్నచూపు, అహంకార ధోరణి పెరిగిపోయిందని మండిపడ్డారు. దళితులు నడిచిన నేల అపవిత్రమైందన్నట్టుగా పసుపునీళ్లు చల్లిన ఘటనలు చోటుచేసుకోవడం దళితులపై ఉన్న వివక్షకు, అగ్రకుల ఆధిపత్య మనస్తత్వానికి పరాకాష్ట అని విమర్శించారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలపై బీఆర్ఎస్ అధిష్ఠానం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీలో కొనసాగుతున్న దళిత నాయకులు, కార్యకర్తలు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని, దళితులను అవమానించే రాజకీయాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దళితుల గౌరవాన్ని కాపాడుకోలేని పార్టీలో కొనసాగడం కంటే బయటకు వచ్చి సామాజిక న్యాయం కోసం పోరాడటం మేలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో దళిత నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు తెలంగాణలోనూ దళితులకు కీలక పదవులు కల్పించడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందనడానికి నిదర్శనమన్నారు. దళితులపై అవమానకరంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఏ చర్యనూ సహించబోమని, దళితులపై వివక్షకు పాల్పడే శక్తుల రాజకీయ అహంకారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మల్కగళ్ల కరుణాకర్, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్,వైస్ ప్రెసిడెంట్ పోతగల రవి, జిల్లా కార్యదర్శి సొక్కం సురేష్, నాయకులు కర్రోల ప్రవీణ్, వీరేష్, గడ్డం నవీన్, అశోక్, మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారం చేస్తే సహించం...

పోలీసులకు ఫిర్యాదు చేసిన అంబేద్కర్ యువజన సంఘం.

**అగ్నిధార న్యూస్,(పెద్దపల్లి) :**

బొంకూరి కైలాసంపై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ నరేష్‌లకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు కైలాసంపై ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఆధారాలను సేకరిస్తున్నామని తెలిపారు. కూలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపైనా పోలీసులకు వివరాలు అందజేస్తామని పేర్కొన్నారు.సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధుపై కైలాసం చేసిన ఆరోపణలను నాయకులు ఖండించారు. సంఘానికి రిజిస్ట్రేషన్ లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆరోపిస్తూ, ఈ అంశంపై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయాలని నిర్ణయించినట్లు



తెలిపారు.ఇదే సమావేశంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్వర్ణోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమానికి సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు సహకరించాలని కోరారు.

సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపెల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి బూడిద రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు నిధులు విడుదల చేయాలి

**హుజూరాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిరాహార దీక్ష**

**అగ్ని ధార న్యూస్,( హుజురాబాద్) :**

అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బండ అశోక్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో శనివారం నిరాహార దీక్ష చేపట్టారు.దీక్షా శిబిరాన్ని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ సందర్శించి మాట్లాడారు. దళిత బంధు రెండో విడత నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. మొదటి విడతలో లబ్ధి పొందని అర్హులైన కుటుంబాలతోపాటు నియోజకవర్గంలో మిగిలిన అర్హులందరికీ పథకాన్ని



వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దళిత బంధును పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందో సమాధానం చెప్పాలని కోరారు. దళిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల సాయం అందించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బుర్ర నటరాజ్, సురేష్, సంతోష్ యాదవ్, దీటి శిరీష రమేష్, జిల్లా నాయకులు యండి సల్మా, జంగ అపర్ణ, దాసరి అంజలి, గౌతమి, రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, అంబాల హరిష్ తదితరులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ ఎలక్ట్రానిక్ కంపెనీలో 21 మంది యువతకు ఉద్యోగాలు



**యువత సద్వినియోగం చేసుకోవాలి టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఇంటర్వ్యూలకు విశేష స్పందన తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ నెల 10న నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలకు కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలకు ఆమనగల్ మండలం నుంచి 10 మంది, వెల్దండ మండలం నుంచి 7 మంది, కల్వకుర్తి మండలం నుంచి 4 మంది కలిపి మొత్తం 21 మంది యువత హాజరయ్యారు. అనంతరం సెప్టెంబర్ 12న నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మొత్తం 21 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగింది.ఉద్యోగాలకు ఎంపికైన యువతకు ఐక్యత ఫౌండేషన్ తరఫున నిర్వాహకులు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ ఉద్యోగాల ద్వారా ఎంపికైన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగాలని ఆకాంక్షించారు. యువత తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.అదేవిధంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగాల కోసం అర్హత కలిగిన వారు 9848244119 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ రూపొందించాలి



.: మల్క కొమురయ్య

**అగ్నిధార న్యూస్,(హైదరాబాద్):**

తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ రూపొందించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో క్రీడారంగంపై జరిగిన చర్చలో ఆయన పలు సూచనలు చేశారు. హర్యానా క్రీడా విధానాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనుగుణంగా మెరుగైన విధానాన్ని రూపొందించాలన్నారు. ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో పాటు అథ్లెటిక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఖేలో ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ద్వారా లభించే కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. మైసూర్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని, క్రీడా హాస్టళ్లలో క్రీడాకారులకు నాణ్యమైన ప్రత్యేక డైట్ అందించాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు స్కాలర్‌షిప్‌లు, ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆటస్థలాలు, పీఈటీ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు అమలు చేయాలని, పీఈటీ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు జిల్లాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్వహణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ కోరారు.

## కెసిఆర్ పరిపాలన కాలం స్వర్ణ యుగం



**గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

వర్గల్ మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటిసి బోయిని కుమార్, బిజెపి వార్డు నెంబర్ లావణ్య నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనుకయ్య తో పాటు తదితరులు శనివారం గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి గులాబీ పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో అందించిన 24 గంటలు ఉచిత కరెంటు, రైతు బీమా, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, త్రాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు, కెసిఆర్ కిట్టు, న్యూట్రిషన్ పెట్టు లాంటి ఎన్నో రకాల అభివృద్ధి సంక్షేమ ఫలాలను అవినీతి లేకుండా నేరుగా గడపగడపకు అందించి తెలంగాణ తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు కేసీఆర్ పరిపాలన కాలం స్వర్ణ యుగమన్నారు. కానీ అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు ప్రజలకు పాలనా అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు, కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు అబద్ధపు అసత్యపు మాట్లాడటం పబ్బం గడుపుతూ అభివృద్ధి సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్ ను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు మూసి కంటే అధ్వానంగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వేలూరు వెంకటరెడ్డి శేరిపల్లి గ్రామ సర్పంచ్ పావని మోహన్ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, వర్గల్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## మహిళా సాధికారతకు కుట్టుమిషన్ శిక్షణ



**శిక్షణ పూర్తిచేసిన మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ**

**అగ్ని ధార న్యూస్ ,(రామగిరి) :**

మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. రామగిరి మండలం రాజాపూర్‌లో అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పూర్తిచేసిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు.సర్పంచ్ పుల్లేల భాగ్యలక్ష్మి కొమురయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. కుట్టుమిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించవచ్చున్నారు. శిక్షణ ధ్రువపత్రాలు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ప్రాంతంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్నూరి వెంకటి, నాయకులు కాల్వ రజిత, పుల్లెల సుజాత, కన్నూరి శశికుమార్, రవి, పర్వతాలు, రోహిత్, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాలి

**ప్రజాధనం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలి: డా. దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :**

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజాధనం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, నిరుద్యోగ సమస్య, పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టడంలో పాలకులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను అమలు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలు, దేశ సంపదను ప్రైవేటీకరణ నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. దేశ ఆస్తులు ప్రజలందరి సొత్తని, వాటి పరిరక్షణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మత విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. పాలకుల నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని, వ్యక్తిపూజకు బదులు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయంపై విశ్వాసం పెంచుకోవాలని డా. నగేష్ సూచించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఆటో జేఏసీ ధర్నాకు హాజరు కావాలి



**అగ్నిధార న్యూస్,(హైదరాబాద్), :**

ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఆటో జేఏసీ ధర్నాకు హాజరుకావాలని బీసీల సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమం వివరాలను ఆయనకు తెలియజేసి, కార్యక్రమానికి హాజరై మద్దతు ఇవ్వాలని కోరారు.

# కడ్తాల్‌లో కొనసాగుతున్న సుంకిరెడ్డి -- మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

**రెండో రోజు 800 మంది సందర్శించగా**
**520 మందికి ఉచిత కంటి పరీక్షలు**
**290 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణీ..**
**26 మంది కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక**
**వైద్య సేవలను పరిశీలించిన ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల్ పట్టణంలోని ఎంబీఏ గార్డెన్‌లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ, చెన్నైకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులతో నిర్వహిస్తున్న 6వ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం రెండో రోజు కూడా విశేష స్పందనతో కొనసాగింది. శిబిరానికి కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రెండో రోజు 800 మందికి పైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించగా, 520 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 290 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయగా, కంటి శుక్లాల సమస్య ఉన్న 26 మంది పేషెంట్లను ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు.వైద్య సేవలను పరిశీలించిన సుంకిరెడ్డి రెండో రోజు కొనసాగుతున్న కంటి వైద్య శిబిరాన్ని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి కంటి పరీక్షల ప్రక్రియ, వైద్యుల సూచనలు, అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం శంకర నేత్రాలయ వైద్య నిపుణులతో మాట్లాడి ఇప్పటివరకు గుర్తించిన కంటి సమస్యలు, కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపికైన పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరూ కంటి వైద్యానికి దూరం కాకూడదు ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితుల కారణంగా పేద ప్రజలు కంటి వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం కంటి పరీక్షలకే పరిమితం కాకుండా అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు, కంటి శుక్లాల ఆపరేషన్లు, తదుపరి వైద్య సేవలు అందించేలా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.రెండు రోజుల్లో 1,400 మందికి పైగా ప్రజల రాక రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరానికి ఇప్పటివరకు 1,400 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. వారిలో 870 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, 500 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. 56 మంది పేషెంట్లను కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. పేదోడి కళ్లలో వెలుగులు నింపడమే మా సేవా సంకల్పం. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సేవా కార్యక్రమాలకు భవిష్యత్తులోనూ మరింత ప్రాధాన్యత ఇస్తాం. ప్రజలకు అవసరమైన చోట, అవసరమైన సమయంలో అండగా నిలవడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యం అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.సెప్టెంబర్ 19 వరకు కంటి వైద్య సేవలుకడ్తాల్‌లో కొనసాగుతున్న ఈ 6వ మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో సెప్టెంబర్ 16 వరకు ఉచిత కంటి పరీక్షలు, సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు అవసరమైన వారికి ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు





నిర్వాహకులు తెలిపారు. కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ శిబిరానికి హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవేందర్, రమేష్ యాదవ్, సీనియర్ నాయకులు బాలయ్య గౌడ్, నాయకులు నరసింహ గౌడ్, ఫౌండేషన్ తల్లోజు రఘు, ఎగిరిశెట్టి లింగం, రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, కొండల్ యాదవ్, శ్రీపతి, శేఖర్, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టితో బంధం.. భక్తితో రూపం అదే గంప లక్ష్మయ్య ట్రస్ట్ అభిమతం

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ప్రజల్లో సామాజిక స్పృహ పెంపొందించడంతోపాటు సేవా కార్యక్రమాలతో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజల్లో గణపతి భక్తులలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నారు. నీటి వనరులు కలుషితం కావడం పర్యావరణం దెబ్బతినేలా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణేష్ విగ్రహాల తయారీ తగ్గించడానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా చేస్తున్న కృషి అభినందనీయం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కడ్తాల్ ఆర్యవైశ్య సంఘం మరియు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను శనివారం కడ్తాల్ పట్టణంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్ ముందు భక్తులకు వేద పండితులు శ్రీధర్ పంతులు, మూర్తి ఆశీర్వచనలు పూజలు చేసిన 2000 మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ, మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణ రక్షిద్దాం అనే నినాదంతో గత 11 సంవత్సరాలుగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న గంప లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా మట్టితో తయారుచేసిన వినాయకులను పంపిణీ చేయడం శుభపరిమాణం అన్నారు. పర్యావరణహితం అందరి అభిమతం అని మట్టితో బంధం భక్తితో రూపం మనందరి అభిమాతమని వారన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు, కుంటలు కలుషితం కాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకే రసాయనాలు లేని మట్టి గణపతులనే పూజించి, ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను నిమజ్జనం చేస్తే అవి తిరిగి మట్టిలో కలిసిపోయి పర్యావరణానికి ఎటువంటి హాని కలగదని తెలిపారు. గంప లక్ష్మయ్య ట్రస్ట్ చేస్తున్న సేవలు మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం పలు సామాజిక సేవా కార్యక్రమాలు కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ, ట్రెజరర్ కర్ణాకర్, ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ అధ్యక్షుడు అర్థం రవికుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వీరేంద్ర గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు అర్థం వాసుదేవులు, సభ్యులు సాయి, వీరేష్, నంద కిరణ్, పసుపుల వీరేష్, గుద్దేటి శ్రీను, రఘు, శ్రీకాంత్, కృష్ణయ్య, విజయ్ గుప్తా, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, కౌన్సిలర్ ఎనుముల రమేష్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు అమృతం పాండు, పద్మశాలి సంఘం రాష్ట్ర



కార్యవర్గ సభ్యులు కె. గోపీనాథ్, బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, జోగు వీరయ్య, ఉపసర్పంచ్లు మహేష్ యాదవ్, రామకృష్ణ, పాండు, మాజీ వార్డు సభ్యులు హెచ్ఆర్ మహేష్, రామచంద్రయ్య, న్యాయవాది సంతోష్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు అమృతం పాండు, నాయకులు దాసు, సురేష్, రాయకంటి సురేష్, సిద్ది గారి సురేష్, దాస్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, మాదారం మహేష్ గౌడ్, శ్రీశైలం ఆదివాసి, కిరణ్ ఆదివాసి, యశ్వంత్, మల్లేష్, యాదయ్య గౌడ్, కాంటెక్టర్ సాయి, మంగళపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మూడు కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంట్ అందజేత



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణ కేంద్రంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు తిమ్మరాసిపల్లిలో అసంపూర్తిగా ఉన్న మూడు ఇళ్ల నిర్మాణానికి సిమెంట్‌ను అందజేశారు.

రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఈ సిమెంట్‌ను లబ్ధిదారులకు అందించారు.ఈ సందర్భంగా శుద్ధకంటి వెంకటయ్య, శుద్ధకంటి యాదయ్య, చిత్తారి శ్రీరాములు కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేందుకు అవసరమైన సిమెంట్‌ను అందజేశారు. పేద కుటుంబాల ఇళ్ల నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పట్టణ మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్ బావాండ్ల మధు, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసులు, బి ఆర్ ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, గుమ్మకొండ రాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. సిమెంట్‌ను అందజేశారు.

రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఈ సిమెంట్‌ను లబ్ధిదారులకు అందించారు.ఈ సందర్భంగా శుద్ధకంటి వెంకటయ్య, శుద్ధకంటి యాదయ్య, చిత్తారి శ్రీరాములు కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేందుకు అవసరమైన సిమెంట్‌ను అందజేశారు. పేద కుటుంబాల ఇళ్ల నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పట్టణ మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్ బావాండ్ల మధు, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసులు, బి ఆర్ ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, గుమ్మకొండ రాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులు





అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆలయాన్ని మరింత సుందరంగా, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే దిశగా పలు పనులు చేపడుతున్నారు. ఫోటోలో కనిపిస్తున్న విధంగా ఆలయ ప్రాంగణంలో పైకప్పు నిర్మాణానికి సంబంధించిన ఇనుప ఫ్రేమ్‌వర్క్ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన నిర్మాణానికి అనుబంధంగా ఉన్న ప్రాంతాల్లో కూడా మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కనిపిస్తోంది. ఆలయ గోపురాలు, విమానాలపై ఇప్పటికే అలంకరణ పనులు ఉండగా, ప్రాంగణాన్ని భక్తులకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ఈ అభివృద్ధి పనులకు స్థానిక దాతలు, భక్తులు తమ వంతు సహకారం అందిస్తుండటంతో ఆలయ అభివృద్ధి ముందుకు సాగుతోంది. భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పనులను పూర్తి చేయడానికి ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు.శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు మరింతగా సహకరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయ అభివృద్ధి పూర్తయితే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ఆలయ ప్రాంగణం మరింత ఆకర్షణీయంగా మారనుంది. అతి త్వరలోనే పైకప్పు రేకులు వేయడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ చింతల రమణారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

## ఉప్పల ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలం అజాలాపురం గునిగంటి రాములు అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్ కొప్పుల రవి గౌడ్. వార్డు సభ్యులు కాలే తిరుపతి .కాలే వెంకటయ్య. వరికుప్పల అడువయ్య. కేశమనే లింగం . గునుగంటి యాదయ్య. కేషమోని శంకర్. పబ్బు జంగయ్య. కాలే అంగయ్య. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి




అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ముతూట్ ఫిన్‌కార్ప్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్వకుర్తి పాలమూరు చౌరస్తా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మట్టి గణనాథుల విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణ హితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు పవన్, ఆంజనేయులు, నరేందర్, శంకర్, వెంకటేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

**సీఎం రేవంత్‌రెడ్డికి మట్టి వినాయకుడిని అందజేసిన ప్రభుత్వ విప్ విజయరమణారావు**

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్) :

వినాయక చవితిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మట్టి వినాయకుడిని అందజేశారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలకు సూచించారు. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.



# కార్మికుడి ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు

సింగరేణి భద్రతపై ఎంపీ వంశీకృష్ణ హెచ్చరిక
ఉత్తర తెలంగాణకు మెరుగైన రైలు కనెక్టివిటీ కల్పించాలి
అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించాలి

**అగ్నిధార న్యూస్, ( రామగుండం) :**

సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఆర్‌జీ-1 పరిధిలోని 11 ఇంక్లైన్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కార్మికుడికి ఆరు కుట్లు పడిన ఘటనను ప్రస్తావిస్తూ, చిన్న ప్రమాదాలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని అన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను కఠినంగా అమలు చేయాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కార్మికుల ప్రాణాల రక్షణకు వినియోగించాలని సూచించారు.

**ఉత్తర తెలంగాణకు రైలు సౌకర్యాలు పెంచాలి**

సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్--సికింద్రాబాద్‌కు అదనపు రైళ్లు నడపాలని రైల్వే బోర్డును కోరినట్లు ఎంపీ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి రైల్వేకు భారీ ఆదాయం వస్తున్నప్పటికీ, ప్రయాణికులకు తగిన సౌకర్యాలు లేకపోవడం అన్యాయమన్నారు. శాశ్వతంగా మెరుగైన రైలు కనెక్టివిటీ కల్పించాలని డిమాండ్ చేశారు.



**అంబేద్కర్ భవనానికి స్థలం ఇవ్వాలి**

అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి సుమారు రూ.50 లక్షలు కేటాయించినట్లు వంశీకృష్ణ వెల్లడించారు. కలెక్టర్ కూడా సింగరేణి యాజమాన్యాన్ని కోరినప్పటికీ స్థల కేటాయింపులో జాప్యం జరుగుతోందన్నారు. వెంటనే స్థలం కేటాయించి నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. కార్మికుల భద్రత, రైలు సౌకర్యాలు, అంబేద్కర్ భవనానికి స్థల కేటాయింపుపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# రాజీ మార్గమే రాజమార్గం






సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు

**అగ్ని ధారా న్యూస్ వనపర్తి జిల్లా:**

రాజీ మార్గం ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు అన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సత్వర న్యాయం లభిస్తుందని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. వనపర్తి జిల్లాలో నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 6,617 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 1,639 క్రిమినల్ కేసులు, 19 సివిల్ కేసులు, 4,959 ప్రీ-లిటిగేషన్ కేసులు ఉన్నాయి. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని న్యాయమూర్తి తెలిపారు.కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కె. లావణ్య బాలరెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. కల్పన, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. కవిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీపా కాసరగడ్డ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటల్లో చక్కని ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గజ్వేల్ డివిజన్ స్పోర్ట్స్ మీట్ లో ఆయా ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు తమదైన శైలిలో శనివారం చక్కటి ప్రతిభను కనబరుస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. చిన్నారుల ఆటలు పలుగురు చూపర్లను ఆకర్షిస్తున్నాయి. తాము ఉన్న టీంలో మేమే గెలవాలని విద్యార్థులు మంచి కృషితో ఆటల్లో రాణిస్తూ గెలుపొందిన తర్వాత వారి ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. సుమారు 100 టీములు కబడ్డీ, వాలీబాల్, కోకో పోటీలలో పాల్గొన్నట్లు ఆర్గనైజర్ ప్రభాకర్ రెడ్డి మరియు గజ్వేల్ డివిజన్ ట్రస్మ అధ్యక్షులు మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్పోర్ట్స్ మీట్ ముగుస్తుందని అన్నారు .ఆదివారం సాయంత్రం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్స్ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణంలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

**హసన్‌పర్తి :** హసన్‌పర్తి పరిధిలోని ఎస్సార్ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. ఇనుపరాడ్డు తలకు గుచ్చుకోవడంతో జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు పప్పు కుమార్ (31) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హసన్‌పర్తి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.జార్ఖండ్ రాష్ట్రం లాతేహార్ జిల్లా మురుపు ప్రాంతం బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ తన సోదరుడు గుడ్డు భయ్యు (38), తోటి మేస్త్రీ ప్రదీప్‌తో కలిసి ఉపాధి కోసం వరంగల్‌కు వచ్చాడు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



ఏఐకేఎంఎస్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**అగ్నిధార,(పెద్దపల్లి) :**

కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరగనున్న ఏఐకేఎంఎస్ ప్రథమ మహాసభ పోస్టర్‌ను శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ.. జిల్లాలో వేలాది ఎకరాల మిగులు భూములు ఉన్నప్పటికీ అనేక మంది భూమిలేని రైతులు కౌలు రైతులుగా జీవిస్తున్నారని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేసి పంట నష్టపరిహారం, ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. రైతాంగ సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్.భీమన్న తెలిపారు. మహాసభను రైతు కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దాము లచ్చన్న, వసంత్, రాజన్న, శంకరన్న, పి.రమేష్, రవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఏవీఆర్ స్కూల్ విద్యార్థిని

**అగ్నిధార న్యూస్ గండీడ్ :**



కరీంనగర్ జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి యోగ పోటీలలో గండీడ్ మండల కేంద్రంలోని ఏ వి ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థిని మోక్షిత సబ్ జూనియర్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అంజిలయ్య గౌడ్, పాఠశాల యజమాన్యం వెంకట్ రాములు, రమేష్, వెంకటస్వామి, అనిల్ కుమార్ పాఠశాల సిబ్బంది విద్యార్థిని మోక్షిత రానున్న రోజులలో యోగ క్రీడలో మంచి సాధన చేసి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. విద్యార్థిని ప్రోత్సహించి అనే మంచి ప్రతిభ కనబడడానికి శిక్షణ ఇచ్చిన యోగా టీచర్ బాలమణిని, విద్యార్థిని తల్లిదండ్రులను పాఠశాల యజమాన్యం అభినందించారు

## 18 వ డివిజన్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని/8ఇంక్లైన్ కాలనీ సెప్టెంబర్ 12**

ఎమ్మెల్యే మక్కాన్ సింగ్,మేయర్ మహంకాళి స్వామి ఆదేశాల మేరకు శనివారం రోజున 18వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, చేయూత వంటి పథకాలను అమలు చేస్తోందని ఈ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుల కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ పార్టీ గడపగడపకు చేరిప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ,అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తున్న, ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సేవే లక్ష్యంగా శ్రమిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ రాజేష్, దామోదర్ ,వీరారెడ్డి. అవినాష్,కుమార్ యాదవ్, రాజు, మహేష్, ప్రశాంత్, సంపత్,శంకర్, డివిజన్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు స్పందనపై హర్షం వ్యక్తం చేసిన టీపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజేష్ యాదవ్

జాతీయస్థాయిలో చర్చ జరిగే విధంగా కార్యాచరణ త్వరలో రూపకల్పన
రాజేష్ యాదవ్

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని సెప్టెంబర్ 12**



ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం జాతీయ విధానాన్ని ఏర్పాటు చేయాలనే పిటిషన్ ను సుప్రీంకోర్టు స్వీకరించి కేంద్ర ప్రభుత్వంతో పాటు, రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మరియు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలికి అత్యున్నత న్యాయస్థానం చారిత్రక పరిణామం అనితెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి రాజేష్ యాదవ్ మాట్లాడుతూ.. టిపిటిఎఫ్ సంఘం తరుపున 15 సంవత్సరాల నుంచి ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని, దేశ నిర్మాణంలో కీలకమైన విద్యారంగంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు విశేషమైన కృషి చేస్తున్నప్పటికీ మా సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు.అర్హతకు తగిన జీతాలు లేకపోవడం, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు లేకపోవడం, ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి అనేక సమస్యలతో నిత్యం మానసిక ఇబ్బందులకు,గురవుతున్నారని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఒక బోర్డు ఏర్పాటు చేయాలని , రాష్ట్రంలో ఎన్నో సంఘాలకు సంక్షేమ బోర్డులు ఉన్నాయని దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేసే ప్రైవేటు ఉపాధ్యాయులకు సంక్షేమ బోర్డు లేకపోవడం స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచిన ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు ఉపాధ్యాయులను పట్టించుకున్న పాపాన పోలేదని ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మూడు లక్షల ప్రైవేటు ఉపాధ్యాయులకు సంక్షేమ బోర్డు నిధిని ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. త్వరలో ఇదే డిమాండ్ తో జాతీయ స్థాయిలో కూడా చర్చ జరిగే విధంగా కార్యాచరణను చేపడతామని రాజేష్ యాదవ్ తెలిపారు.

## ఖనిలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి



ఎస్సీ కమిషన్ సభ్యుడు, రామగుండం సీపీకి బార్ అసోసియేషన్ వినతి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరిఖని కేంద్రంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రత్యేక కోర్టుతో పాటు మహిళా పోలీస్‌స్టేషన్, మహిళా కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని గోదావరిఖని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ జ్యోతి భవన్‌లో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. జనాభా, ఎస్సీ, ఎస్టీ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రామగుండం ప్రాంతంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మహిళలపై వరకట్న వేధింపులు, గృహహింస కేసులు అధికంగా నమోదవుతున్నందున మహిళా పోలీస్‌స్టేషన్, కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్‌రావు, జాయింట్ సెక్రటరీ కుమార్ ముచ్చకుర్తి, లైబ్రరీ సెక్రటరీ గజ్జెల ప్రసన్న, క్రీడా కార్యదర్శి అసంపల్లి రవీందర్, మహిళా ప్రతినిధి ముక్కెర అంజలి, నాయకులు షానవాజ్‌ఖాన్, చిదురాల రమేష్, మార్కాపురి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
డీసీపీ భూక్య రామ్‌రెడ్డి

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి) :**




జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ భూక్య రామ్‌రెడ్డి సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువులు, కాలువల వైపు వెళ్లవద్దని హెచ్చరించారు.

వరద నీటిలో ప్రయాణించే ప్రయత్నం చేయకూడదని సూచించారు. వాహనదారులు వర్షాల సమయంలో నెమ్మదిగా ప్రయాణిస్తూ రహదారి పరిస్థితులను గమనించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని, అధికారులు సూచించే భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని డీసీపీ ఒక ప్రకటనలో కోరారు

